కోట్ల నిధులు.. నీటి పాలు

- అక్కరకు రాని రైల్వే అండర్ పాస్
- రూ.4.88 కోట్లతో నిర్మాణం
- ఊట నీటితో అవస్థలు
- వంద గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బంది


తుని తాళ్లూరు రైల్వే అండర్ పాస్‌లోకి చేరిన ఊట నీరు

తుని: ప్రజల సౌకర్యం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్మించే కట్టడాలు దీర్ఘకాలంగా ప్రజలకు సేవలు అందించాల్సిన అవసరం ఉంది. ఇందులో రైల్వేశాఖకు సంబంధించిన నిర్మాణాలు అంటే నాణ్యతకు పెట్టింది పేరు. ఇంతటి పేరు ప్రాఖ్యాతులు కలిగిన రైల్వేశాఖ ఆధ్వర్యంలో నిర్మించిన రైల్వే అండర్ పాస్ ఊట నీటితో అక్కరకు రాకుండా పోయింది. దీనికి పది, యాభై లక్షలు కాదు. అక్షరాల రూ.4.88 కోట్లు ప్రజాధనాన్ని వెచ్చించారు. అండర్ పాస్ నిర్మాణాన్ని జాతీయ స్థాయి ఉన్న బడా కాంట్రాక్టర్‌కు అప్పగించారు. తునితో పాటు కాకినాడ, అనకాపల్లి జిల్లాల పరిధిలో పలు ప్రాజెక్టుల పనులను దక్కించుకున్నారు. రైల్వేశాఖలో ఉన్న లోసుగుల కారణంగా బడా కాంట్రాక్టర్లు థర్డ్ పార్టీకి అప్పగించి పనులు పూర్తి చేసి బిల్లు తీసుకుని చేతులు దులుపుకొన్నారు. ఇదే విషయంలో తునిలో నిర్మించిన రైల్వే అండర్ పాస్ విషయంలో జరిగింది. ఒక్కసారిగా అండర్ పాస్‌లోకి నీరు చేరడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి. అధికారులు శాశ్వత చర్యలు తీసుకోవడం విఫలమయ్యారు. దీంతో వంద గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

అండర్ పాస్ నిర్మాణానికి రూ.4.88 కోట్లు

తుని పట్టణంతోపాటు రూరల్ మండలం, రౌతులపూడి మండలాలకు చెందిన 100 గ్రామాలకు తాళ్లూరు రైల్వే గేటు ప్రధాన మార్గం. రెండు రైల్వే లైన్లు ఉండడంతో రైలు వస్తే చాలు అరగంట సమయం గేటు మూసి ఉండేది. దీంతో ఎంతో మంది అత్యవసర పనులు, వైద్య సేవలు కోసం వచ్చి ఎక్కువ సమయం వేచి ఉండాల్సి వచ్చేది. అప్పటి ప్రభుత్వాలు ప్రజల సమస్యను పట్టించుకున్న పాపాన పోలేదు. 2019లో వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అప్పటి రాష్ట్ర రోడ్లు రవాణా శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, కాకినాడ పార్లమెంట్ సభ్యురాలు వంగా గీతా విశ్వనాథ్ జోక్యం చేసుకుని రైల్వే అండర్ పాస్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధులు తీసుకువచ్చారు. కేంద్రం రూ.4.88 కోట్లు నిధులు మంజూరు చేశారు. దీంతో 2022లో రైల్వే అండర్ పాసును ప్రారంభించారు.

నిర్వహణ ప్రైవేటు సంస్థకు అప్పగింత

రైల్వే అండర్ పాస్ నిర్వహణను ప్రైవేటు సంస్థకు అప్పగించారు. తొలుత రెండేళ్ల పాటు నిర్వహణ చేస్తారని అధికారులు చెప్పారు. వర్షం నీరు అండర్ పాస్‌లోకి చేరితే విద్యుత్ పంపు సహాయంతో బయటకు తోడి పంపించాల్సి ఉంది. రెండేళ్ల పాటు ఏ విధమైన వర్షాలు లేవు. ప్రస్తుతం వర్షాలు లేక పోయిన రైల్వే బంటాలోని ఊట నీరు చేరుతుంది. దీంతో వాహనాల రాక పోకలకు అంతరాయం కలుగుతుంది. నిర్మాణానికి అనుమతి ఇచ్చిన అధికారులు వర్షం నీరు పోవడానికి తగిన మార్గం చూపలేదు. అండర్ పాస్ నుంచి గెడ్డబీడు వరకు కాలువ నిర్మాణం చేయాలి. ఇది కూడా చేయలేదు. ఊటనీరు అండర్ పాస్‌లోకి చేరడంతో దుర్వాసనతోపాటు పాదచారులు వెళ్లడానికి అవకాశం లేకుండా పోయింది.

నీరు పోవడానికి చర్యలు

గతంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం నిర్వహణకు ఇచ్చారు. నీరు పంపింగ్ చేయడానికి ఏర్పాటు చేసిన మోటారు సరిగా పని చేయడం లేదు. దీంతో నీరు భారీగా నిలిచిపోవడంతో ప్రజలకు ఇబ్బంది కలుగుతోంది. నిలిచిపోయిన నీటిని ఆటోమెటిక్ పైపు ద్వారా బయటకు పంపుతున్నాం. వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఐఏవో డబ్యూ, తుని

ప్రతి రోజూ ఇబ్బంది

రైల్వే ట్రాక్ ఆవతల ఉన్న వంద గ్రామాలకు చెందిన ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అండర్ పాస్‌లో నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. దీంతో తుని పట్టణంలోకి రావాలంటే 3 కిలోమీటర్లు చుట్టూ తిరిగి రావాల్సి వచ్చింది. అండర్ పాస్ నిర్మించినా నీరు పోవడానికి ఏర్పాట్లు చేయలేదు. ప్రభుత్వాలు రూ.కోట్లు వెచ్చించినా ప్రజలకు అధికారుల నిర్లక్ష్యం వలన వరద నీటి సమస్యకు పరిష్కారం లభించలేదు.

– జి.రమణ, రైతు, తుని మండలం

క్లుప్తంగా

ఆర్టీఐ స్టేట్ సెక్రటరీగా శివాజీ

గండేపల్లి: ఆర్టీఐ స్టేట్ అడిషనల్ సెక్రటరీగా నియామక పత్రం అందుకున్నట్టు సాలిపల్లి శివాజీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నూతన కమిటీ నియామకంలో భాగంగా గుంటూరులో జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజా సంకల్ప వేదిక అధ్యక్షుడు మదిరే రంగసాయిరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నట్టు తెలిపారు.

ఎంపీడీఓ కార్యాలయంలో షీ బాక్సు ఏర్పాటు

తుని రూరల్: తుని మండల పరిషత్ కార్యాలయంలో ఆవరణలో ఎంపీడీఓ ఎస్.సాయి నవీన్ షీబాక్సు ఏర్పాటు చేశారు. మంగళవారం లైంగిక వేధింపులు నిరోధకతపై ఎవరైనా తమ ఫిర్యాదులను షీ బాక్సులో వేయవచ్చని ఎంపీడీఓ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు లైంగిక వేధింపులో నివారణలో భాగంగా ఈ షీ బాక్సు ఏర్పాటు చేశామన్నారు. ప్రతిరోజు సాయంత్రం ఈ షీబాక్సును తెరిచి ఫిర్యాదులను పరిశీలిస్తామన్నారు. ఎవరైన ఫిర్యాదులు వేస్తే సంబంధిత వివరాలను గోప్యంగా ఉంచడంతో పాటు కలెక్టర్, పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం అందించి బాధిత మహిళలకు తక్షణ న్యాయం చేస్తామన్నారు.

నేడు బడ్జెట్ సమావేశం

తుని: పురపాలక సంఘం 2025–26 బడ్జెట్ సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అధ్యక్షతన బుధవారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని కమిషనర్ వెంకట్రావు మంగళవారం తెలిపారు. పన్నులు, గ్రాంటులు, ప్రభుత్వ నిధులు, నిర్వాహణ, వ్యయం తదితర వాటికి సంబంధించిన అంశాలను అజెండాలో పొందు పరిచినట్టు తెలిపారు. మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు హాజరు కావాలని కోరారు.

ఆశ్రమ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

రౌతులపూడి: రాఘవపట్నం గిరిజన ఆశ్రమ పాఠశాలలో మంగళవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు గుమ్మిడి గంగరాజు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు వైభవంగా జరిగాయి. పాఠశాల ఆవరణలో రంగవల్లులు వేసి గొబ్బెమ్మలు ఉంచారు. గొబ్బెమ్మల చుట్టూ బాలికలు తిరుగుతూ పాటలు పాడారు. హరిదాసు వేషదారుణలో చిన్నారులు పాడిన హరినామ కీర్తనలు, పాతంగుల ప్రదర్శన పలువురిని ఆకట్టుకున్నాయి. విద్యార్థినులు చేసిన కోలాటం ప్రజలను అలరింపజేసింది. ఉపాధ్యాయులు పోతురాజు, మధులత, శ్రీఫణి, సురేష్, శివరామన్నదొర, విద్యార్థులు పాల్గొన్నారు.


సంప్రదాయ వేషధారణలో చిన్నారులు

న్యూవైరస్‌పై అప్రమత్తంగా ఉండాలి

ప్రత్తిపాడు: న్యూవైరస్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక సీహెచ్‌సీ సూపరింటెండెంట్ బి.సౌమ్య హెచ్చరించారు. సీహెచ్‌సీలో మంగళవారం న్యూవైరస్, ఆసుపత్రి సేవలపై రోగులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. శానిటైజర్ వాడకం, మాస్కులు ధరించడం వంటి విపాటించాలన్నారు. గర్భిణులు వైద్య సేవలు తప్పనిసరిగా పొందాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిల్డ్రన్స్ హోమ్ తనిఖీ


చిల్డ్రన్స్ హోమ్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా అధికారుల బృందం

జగ్గంపేట: గొల్లలగుంట గ్రామంలో నిర్వహిస్తున్న చింతాడ హెల్పింగ్ హ్యాండ్స్ చారిటిబుల్ ట్రస్టును ఆరుగురితో కూడిన జిల్లా అధికారుల బృందం మంగళవారం తనిఖీ చేసింది. అధికారుల బృందానికి నాయకత్వం వహించిన డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సీహెచ్ వెంకట్రావు మాట్లాడుతూ పిల్లలతో హాస్టల్ నడిపి స్వచ్ఛంద సంస్థలు, జేజే యాక్ట్ ప్రకారం సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్, ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ ఏదో ఒకదానిలో రిజిస్టర్ చేయించుకుని ఉండాలని తెలిపారు. లేనికుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గొల్లలగుంటలో చింతాడ స్వచ్ఛంద సంస్థ జేజే యాక్ట్‌లో రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న కారణంగా నిబంధనలకు అనుగుణంగా ఇక్కడ ఏర్పాట్లు ఉన్నాయో లేదో పరిశీలించడానికి వచ్చినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీపీఓ ఎం.చంద్రశేఖర్, సీడీపీఓ పూర్ణిమ, పీఓఐసీ శ్రీనివాసరావు, సీఓఎస్ఐసీ జె.విజయ, ఎల్‌సీపీ ఎం.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

గండేపల్లి: గ్రామంలో హైదారాబాద్‌కు చెందిన వెంకటసాయి భావన గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఎండీ ఉదయ భాస్కర్ చేతుల మీదుగా మంగళవారం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. స్థానికంగా ఉన్న గంగిన వెంచర్స్ అభివృద్ధి, ఆయన కుటుంబంలో జరగనున్న శుభకార్యక్రమం సందర్భంగా వీటిని అందజేస్తున్నట్టు తెలియజేశారు. వెంచర్ అభివృద్ధి పూర్తయిన అనంతరం నాలుగు కుటంబాలకు ఉచితంగా గృహాలు నిర్మించి ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల కొలతల్లో కచ్చితత్వం పాటించాలి


తునిలో వీడియో శిక్షణ కార్యక్రమాన్ని తిలకిస్తున్న ఏపీడీ, ఏపీఓ, టీఏ, ఎఫ్‌ఏలు

తుని రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీలు చేస్తున్న పనుల కొలతల్లో కచ్చితత్వం పాటించాలని, కూలీలందరికీ గరిష్ఠ కూలి లభించేలా పనులు జరగాలని కత్తిపూడి క్లస్టర్ ఏపీడీ జగదాంబ అన్నారు. మంగళవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిర్వహణపై రాష్ట్రస్థాయిలో జరిగిన వీడియో శిక్షణ కార్యక్రమానికి ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అధికారులు, ఏపీఓలతో కలసి ఆమె తుని మండల పరిషత్ కార్యాలయంలో హాజరయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో కీలకపాత్ర ఫీల్డ్ అసిస్టెంట్లదే అన్నారు. ఉన్నత అధికారుల ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. కూలీల శ్రమ, పథకం లక్ష్యాలకు అనుగుణంగా గిట్టుబాటయ్యే విధంగా కూలి లభించాలన్నారు. అందుకు క్షేత్రస్థాయిలో సిబ్బంది పనులు అప్పగించడం, చేయించడం, పక్కాగా కొలతలు నమోదు చేయాలన్నారు. ప్రలోభాలకు, రాజకీయ ఒత్తిడికి గురికావద్దన్నారు. ఏ స్థాయిలోనైన అక్రమాలకు పాల్పడినట్టు రుజువైతే కఠిన చర్యలకు గురవుతారని ఏపీడీ జగదాంబ హెచ్చరించారు. ఏపీఓ పసుపులేటి నారాయణరావు, ఎఫ్‌ఏలు, టీఏలు, జేఈ పాల్గొన్నారు.

బాలికల సంరక్షణపై అవగాహన


తునిలో సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై విజయ్‌బాబు, అధికారులు

తుని: బాలికల సంరక్షణపై ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సమగ్ర శిక్షణ, చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి టి.ఉమామహేశ్వరి అన్నారు. మంగళవారం సాయంత్రం తుని బ్యాంక్ కాలనీ ఉన్నత పాఠశాలలో బాలికల సంరక్షణ అనే అంశంపై మండల స్థాయి శిక్షణ కార్యక్రమం ఐసీడీఎస్ సీడీపీవో శ్రీలత అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఉమామహేశ్వరి బాలికల చట్టంలో కల్పించిన అంశాలు, పోక్సో చట్టం తదితర అంశాలకు సంబంధించి జిల్లా పోలీస్‌శాఖ రూపొందించిన వీడియోలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. బాలికలను కొట్టడం, దురుసుగా ప్రవర్తిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్సై విజయ్‌బాబు అన్నారు. విద్యార్థుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎంఈవో పరవాడ గీతాదేవి, రామకృష్ణ, ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

భగవద్గీత గ్రంథ ప్రచారం


ఆనూరులో భగవద్గీత గ్రంథం, సంక్రాంతి పండగ విశిష్టతను ప్రచారం చేస్తున్న సమితి సభ్యులు

తొండంగి: పైడికొండ పంచాయతీ ఆనూరు గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథం ప్రచారం మంగళవారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, రాజమండ్రి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ సంయుక్తాధ్వర్యంలో గ్రామంలో కమిటీ సభ్యులు భగవద్గీత మానవాళి అందరికీ ఎంతో ప్రయోజనకరమైందని, మానవ జీవితంలో ఎదురయ్యే సమస్యల పరిష్కారం కోసం ప్రతి ఒక్కరూ చదవి అర్థం చేసుకోవాల్సిన గొప్ప గ్రంథమని ప్రచారం చేశారు. అదేవిధంగా భోగి, సంక్రాంతి, కనుమ పండగల విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి, ఇందూజ్ఞాన వేదిక ఉపాధ్యాయులు బి.శాంతరాజు, జలంధర్ సత్యవతి, స్వాతి, జగన్, నందన తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు హత్యకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ


తునిలో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

తుని: నిజాన్ని నిర్భయంగా రాసిన జర్నలిస్ట్ ముఖేష్‌ను అత్యంత క్రూరంగా హత్య చేయడాన్ని నిరసిస్తూ తునిలో జర్నలిస్టులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మంగళవారం సాయంత్రం గొల్ల అప్పారావు సెంటర్‌లో నిరసన తెలిపారు. ముఖేష్ హత్యకు పాల్పడిన వ్యక్తులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని జర్నలిస్టులు డిమాండ్ చేశారు. జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని కోరారు. తుని పట్టణానికి చెందిన జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఎన్ఆర్జీఎస్ సిబ్బందికి శిక్షణ

గండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్ఆర్జీఎస్ సిబ్బందికి మంగళవారం శిక్షణ నిర్వహించారు. జనవరి నుంచి జూన్ వరకు ఆరు నెలలలో చేపట్టబోయే ప్రాధాన్యత పనులు, ఉపాధి హామీ చట్టం ప్రధాన అంశాలు, కూలీల హక్కులు, క్షేత్ర సహాయకులు, విధులు–బాధ్యతలు, సుపరిపాలన తదితర అంశాలపై ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్టు ఎంపీడీఓ నాతి బుజ్జి తెలిపారు.

విశ్వబ్రాహ్మణులకు ఉన్నత స్థానం కల్పించాలి

కిర్లంపూడి: రాజకీయ పార్టీలు విశ్వబ్రాహ్మణులను ఓటింగ్ బ్యాంక్‌గానే ఉపయోగించుకుంటున్నారు తప్పా రాజకీయంగా ఏ పదవులు ఇవ్వడం లేదని జిల్లా విశ్వబ్రాహ్మణుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అత్తిలి వీరబ్రహ్మం ఆవేదన వ్యక్తం చేశారు. పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో అత్తిలి వీరబ్రహ్మం అధ్యక్షతన మంగళవారం జిల్లా కార్యవర్గ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు ఆవుపాటి ఉమాశంకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ నెల 26న విజయవాడలో నిర్వహించే విశ్వబ్రాహ్మణుల రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నెల్లుపూడి ఉదయ్, అంగుళూరి ధర్మరావు, చెల్లూరి సత్యన్నారాయణ, ఉపాధ్యక్షుడు ముదుపాక రమణ, విశ్వబ్రాహ్మణుల సంఘం మండలాధ్యక్షుడు గానుగుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొత్తరపు ప్రసాద్, చెలపాక శివప్రసాద్ తదితరులు ఉన్నారు.

రేపటి సమావేశాన్ని విజయవంతం చేయండి

తుని: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగ చేపట్టిన లక్ష డప్పులు, వెయ్యి గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గురువారం తునిలో నిర్వహించనున్న అత్యవసర సమావేశాన్ని జయప్రదం చేయాలని నియోజకవర్గం ఇన్‌చార్జి ఆరుగుల కృష్ణ కోరారు. మంగళవారం గొల్ల అప్పారావు సెంటర్ తారకరామా నగర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ నెల 9న జరిగే సమావేశానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు కొండేపూడి శ్యాంబాబు మాదిగ, జిల్లాకు చెందిన నాయకులు హాజరవుతారన్నారు. పెదపూడి గవరయ్య మాదిగ, ఆరుగుల మోషే, తుమ్మలపల్లి జ్యోతి, డొక్కా ఆజయ్‌బాబు, జగదీష్, రాజబాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా సామాజిక తనిఖీ గ్రామసభ

- పోలీసు జోక్యంతో సద్దుమణిగిన వాగ్వాదం


లంపకలోవ సామాజిక తనిఖీ గ్రామసభలో పనుల వివరాలను వెల్లడిస్తున్న డీఆర్పీ శ్రీరామమూర్తి


లంపకలోవ సామాజిక తనిఖీ గ్రామసభలో రభస

ప్రత్తిపాడు: లంపకలోవ గ్రామ పంచాయతీ వద్ద మంగళవారం నిర్వహించిన సామాజిక తనిఖీ గ్రామసభ రసాభాసగా మారింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో బినామీ మస్తర్లు, గ్రామంలో లేని, మంచంపై నుంచి లేవలేని వేతన జీవుల పేరుతో వేతనాల చెల్లింపులు జరగడమే ఇందుకు కారణం. ఒకానొక దశలో వాగ్వివాదాలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. పోలీసుల జోక్యంతో సద్దుమణిగింది. గ్రామ సర్పంచ్ పంది మణికుమారి దొరబాబు అధ్యక్షతన డీఆర్పీ శ్రీరామమూర్తి గ్రామసభను నిర్వహించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద సుమారు రూ.40 లక్షలతో 30 పనులు, పంచాయతీ రాజ్ నిధులు రూ.8.19 లక్షలతో జరిగిన పనులను ఈనెల 4వ తేదీ నుంచి ఏడో తేదీ వరకు ఆడిట్ బృందం తనిఖీ చేసింది. ఈ పనుల వివరాలను డీఆర్పీ సభలో వెల్లడించారు. కర్రి వాని చెరువు పనుల్లో రూ.31 వేలు అదనంగా వేతనాలు చెల్లించారు. గ్రామంలో మొత్తం 576 మస్తరు కాగితాలు ఉపయోగించగా ఆ మస్తర్లలో దిద్దుబాట్లు, ఒకరి కంటే ఎక్కువ మందికి ఒకరే వేలు ముద్రలు వేసినట్టు గుర్తించారు. చేసిన పనులకు సంబంధించి ఒక్కటి కూడా శిలాఫలకాలు(బోర్డులు) ఏర్పాటు చేయలేదు. కొబ్బరి మొక్కల పెంపకంలో రూ.23 వేలు దుర్వినియోగమైనట్టు గుర్తించారు. ఉపాధి పనులకు పంచాయతీ తీర్మానాలు లేవు. ప్రతి 3వ శుక్రవారం నిర్వహించాల్సిన సమావేశాలు లేవు. పూర్తిస్థాయిలో రిజిస్టర్ల నిర్వాహణ లేదు. తదితర విషయాన్నీ డీఆర్పీ వెల్లడించారు. అయితే సభ ముగింపు దశలో పనుల్లో జరిగిన అవకతవకలపై సర్పంచ్ పంది మణికుమారి దొరబాబు, చెక్కపల్లి బూరయ్య, సమ్మిటి అమ్మిరాజు, చెక్కపల్లి మందేశ్వరరావు తదితరులు డీఆర్పీకి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. పనికి రాకుండా వేతనం తీసుకున్న వ్యక్తి ఫిర్యాదు చేయాలే తప్పా, ఫిర్యాదు చేయడానికి మీరెవరంటూ సర్పంచ్ వ్యతిరేక వర్గం ఘర్షణకు దిగింది. వారి మధ్య అరుపులు, కేకలతో వాదోపవాదనలు మితిమీరడంతో ఎస్సై లక్ష్మీకాంతం జోక్యం చేసుకుని ఇరువర్గాలను వారించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.వీరబాబు, ఉపాధి హామీ పథకం క్షేత్రస్థాయి సిబ్బంది, ఆడిట్ బృందం తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రత్తిపాడు రూరల్: ధర్మవరం గ్రామంలో పలు బాధిత కుటుంబాలను మంగళవారం ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కొట్నాల మధు ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడ్డారు. ఆయన్ని మురళీరాజు పరామర్శించి రూ.ఐదు వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నానిపల్లి చంటి, కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు, జువ్వల దొరబాబు, వెంకటేశ్వరరావు, శ్రీను, ఏసు, ముసలియ్యా, ఏసు, భాస్కర్ పాల్గొన్నారు.

ఉల్లాస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

తొండంగి: గ్రామాల్లో 15 ఏళ్ల పైబడిన నిరక్షరాస్యులైన వారిని అక్షరాస్యులుగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉల్లాస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉల్లాస్ జిల్లా కోఆర్డినేటర్ వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో స్త్రీ శక్తి భవనంలో వాలంటరీ ఉపాధ్యాయులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేశ్వరరావు, ఏపీఎం వై.సత్తిబాబు, అధికారులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

గోకవరం: భూపతిపాలెం గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పూర్వ విద్యార్థుల సహకారంతో స్టడీ మెటీరియల్ అందజేశారు. పాఠశాల ఆవరణలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో 83 మంది విద్యార్థులకు అలుమ్ని అసోసియేషన్ సుమారు రూ.లక్ష విలువ చేసే స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు అందజేశారు. అలుమ్ని అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సుజ్ఞాన్‌కుమార్ మాట్లాడుతూ త్వరలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు స్టడీ మెటీరియల్ ఉపయోగపడుతుందన్నారు. భూపతిపాలెం గురుకుల పాఠశాలకు పదో తరగతి ఫలితాల్లో ప్రత్యేక గుర్తింపు ఉందని, విద్యార్థులు ఈ స్టడీ మెటీరియల్‌ని సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సభ్యులు పీబీ శ్రీనివాసపరమహంస, సునీల్, సురేంద్ర, ప్రసాద్ బాబు, శ్రీహరి, నీలి శ్రీనివాస్, రవికుమార్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు మెటీరియల్ అందిస్తున్న సభ్యులు

మా స్థలాలు ఇప్పించండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

కిర్లంపూడి: ఆక్రమణల చెరలో ఉన్న మా భూములను ఇప్పించాలంటూ తామరాడ గ్రామానికి చెందిన పలువురు దళితులు మంగళవారం తహసీల్దార్ జె.చిరంజీవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తామరాడ గ్రామంలో సుమారు 25 సంవత్సరాల క్రితం ఒక్కొక్కరికీ 47 సెంట్లు చొప్పున 6కి డీ పట్టాలు ఇచ్చారన్నారు. అదే గ్రామానికి చెందిన పలువురు మా తల్లిదండ్రుల నుంచి మగతా రూపంలో భూములను లీజుకు తీసుకుని ఆక్రమించుకున్నారని వాపోయారు. గత ప్రభుత్వం భూ రీసర్వే నిర్వహించి మాకు పాస్‌పుస్తకాలు ఇచ్చిందని, భూమికి సంభందించిన అన్ని ఆధారాలు ఉన్న మమ్మల్ని మా పొలంలోకి రానివ్వకపోవడంతో తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. తొలిత తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. బాధితులు ఊబ స్వామి, పలపటి వివేక్, పల్లి దేవానందం, పలివేల మోహన్‌తో పాటు పలువురు ఉన్నారు.

ధర్మవరంలో ఎక్సైజ్ దాడులు

ప్రత్తిపాడు: ధర్మవరం గ్రామంలోని సారా స్థావరాలపై మంగళవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 800 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి, సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్టు ప్రత్తిపాడు ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తెలిపారు.

సూక్ష్మ సేద్యంతో మెట్ట భూములు సస్యశ్యామలం


తాళ్లూరులో డ్రిప్ ఇరిగేషన్‌పై అవగాహన కల్పిస్తున్న ఏఓ అశోక్‌కుమార్

తుని రూరల్: సూక్ష్మ సేద్యం పరికరాలతో మెట్ట భూములు సస్యశ్యామలవుతున్నాయని మండల వ్యవసాయ అధికారి బి.అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం తాళ్లూరులో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయంలో ఆవహన కల్పించిన ఆయన క్షేత్రస్థాయిలో అపరాల పంటలను రైతులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగునీటి ఎద్దడి నివారించడంతో పాటు తక్కువ నీటితో ఎక్కువ సాగు చేసేందుకు సూక్ష్మ సేద్యం పరికరాలు ఉపయోగపడుతున్నాయన్నాను. సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. రెండున్నర అంగుళాల నలుపు నీటి పైపులు 30కి రైతు వాటాగా రూ.12,500 చెల్లించాలన్నారు. ఆసక్తి ఉన్న రైతులు సంబంధిత వీహెచ్ఏ, వీఏఏలను సంప్రదించాలన్నారు. రబీలో పంట నమోదు చేయించుకోవాలని రైతులకు ఆయన సూచించారు. వీఏఏ శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

ఈ–పంట నమోదు చేయించుకోవాలి

గండేపల్లి: రబీ పంటకు తప్పనిసరిగా ఈ–పంట నమోదు చేయించుకోవాలని అగ్రికల్చర్ జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ సీహెచ్ హరి తెలియజేశారు. మండలంలోని సూరంపాలెం, యర్రంపాలెంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. డీఆర్సీ ఏఓ సంజీవ్, వీఆర్వో బాబా, ఏఈఓ చంద్రమౌళి, విహెచ్ఏ సాయికిరణ్, వీఏఏ సుమిత్రా, రైతులు పాల్గొన్నారు.

పల్లాకు తెగులుపై అప్రమత్తంగా ఉండాలి

ప్రత్తిపాడు రూరల్: పల్లాకు తెగులుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారి పి గాంధీ రైతులకు సూచించారు. మండలంలోని ధారమల్లాపురం, వేళంగి, ఒమ్మంగి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అపరాల సాగులో పల్లాకు తెగులు, తెల్లదోమ వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. వీటి బారిన పడిన మొక్కలను పీకి నాశనం చేయాలన్నారు. ఎ కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాస్, మౌళిప్రసాద్, మణికంఠ, వికాస్, ప్రభాస్, శ్రావణి, బిందు, సీత, రామలక్ష్మీ, తరుణ్, శ్యాం, రాజు, తాతాజీ, చిన్న, విలియం, నాగేంద్ర, మల్లీశ్వరి, కొండమ్మ, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులు సంప్రదాయ క్రీడలే ఆడాలి

- పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు
- అన్నవరంలో వాలీబాల్ పోటీలు ప్రారంభం


కార్యక్రమంలో మాట్లాడుతున్న పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు, చిత్రంలో సీఐ సూర్య అప్పారావు, ఎస్సై శ్రీహరి బాబు తదితరులు

అన్నవరం: యువత కోడిపందాలు, జూదం వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, సంప్రదాయ క్రీడలైన వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ వంటి ఆటలు ఆడాలని పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరి రాజు అన్నారు. మంగళవారం ఆయన స్థానిక సత్యదేవ డిగ్రీ కళాశాలలో వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. సమావేశంలో ప్రత్తిపాడు సీఐ బి.సూర్యఅప్పారావు, ఎస్ఐ శ్రీహరి బాబు, డిగ్రీ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన సంప్రదాయ క్రీడలు

జగ్గంపేట: నియోజకవర్గం పరిధిలో సర్కిల్ పోలీసులు నిర్వహించిన సంప్రదాయ క్రీడలు మంగళవారంతో ముగిశాయి. జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, జగ్గంపేట ఎస్సై రఘునాథరావు ఆధ్వర్యంలో స్థానిక డిగ్రీ కళాశాల ఆవరణలో జరిగిన సాంప్రదాయ క్రీడలు ముంగింపు కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి క్రీడాకారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని నేతలు, అధికారులు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థులు డ్యాన్స్‌లతో సందడి చేశారు. అనంతరం ఆటల పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేవారు. మొత్తం 8 విభాగాల్లో ఆటల పోటీలలో జరిగాయి. ఈ పోటీల్లో మొదటి, రెండో, మూడో బహుమతులు గెలిచిన క్రీడాకారులకు కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖులు చేతులతో రూ.1.20లక్షలతో నగదు బహుమతులు, గిఫ్టులు అందజేశారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు, జగ్గంపేట ఎంపీపీ అత్తులూరి నాగబాబు, జగ్గంపేట సొసైటీ మాజీ అధ్యక్షురాలు జ్యోతుల మణి, జగ్గంపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.


ఏలేశ్వరంలో వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న సీఐ

యువత క్రీడలపై ప్రత్యేక దృష్టి

ఏలేశ్వరం: యువత క్రీడల్లో రాణించాలని సీఐ సూర్య అప్పారావు అన్నారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సంక్రాంతిని పురస్కరించుకుని గ్రామీణ సంప్రదాయ క్రీడల్లో భాగంగా పట్టణంలో మంగళవారం వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో క్రీడాకారులతో కలిసి వాలీబాల్ ఆట ఆడారు.కార్యక్రమంలో ఎస్సై రామలింగేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు జ్యోతుల పెదబాబు, మున్సిపల్ కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, యండగండి నాగబాబు పాల్గొన్నారు.